

లక్కీడ్రా, లాటరీ నిర్వహిస్తే కఠిన చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, జిల్లాలో లక్కీడ్రా, లాటరీలు వంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. లాటరీలు లేదా లక్కీడ్రాలు నిర్వహి స్తున్నట్లు గురిస్తే పోలీసు స్టేషన్ లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూం. నంబరు 8712670551కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిని తొలగించాం

కాగజ్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిర్పూరు పేపర్ మిల్స్ ఎంప్లాయీస్ యూనియన్(రిజిస్టరు నంబరు 2735) అధ్యక్షుడిగా ఉన్న కొంగ సత్యనారాయణను తొలగించినట్టు వ్యవస్థాపకులు గోగర్ల రాములు, ఉపాధ్యక్షులు చిట్టవేలు రాజేష్ తెలిపారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ సిర్పూరు పేపర్ మిల్స్ ఎంప్లాయిస్ యూనియన్ సిర్పూరు బీజేపీ ఎమ్మెల్యేకు మద్దతు ఉంటుందన్నారు. కాని ఈసంఘానికి అధ్యక్షుడిగా ఉన్న కొంగ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గోలేం వెంకటేష్‌లు ఇటీవల బీజేపీ వీడీ బీఆర్‌ఎస్‌లో చేరినట్టు తెలిపారు. దీంతో సంఘ సమావేశంలో సభ్యులు తీర్మానించి ఇద్దరిని సంఘంలో తొలగిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో శ్యాంరావు, శ్రీనివాస్, బండి శ్రీనివాస్, ఉమాశంకర్, శంభుతాటి వెంకటేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' పోరుపై యువత గురి

- పోటీ చేసేందుకు పలువురి ఆసక్తి
- ప్రశ్నించే గొంతుగా ఉంటామని ప్రజలకు భరోసా
- రసవత్తరం కానున్న పంచాయతీ ఎన్నికలు



బెజ్జూరు ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలా మంది యువకులు సన్నద్ధమవుతున్నారు. ఏ నోటా విన్నా ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల మాటనే. ప్రతి గ్రామంలో ఈ సారి యువకులు పోటీకి దిగుతారని చెబుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదని చెబుతున్నారు. ఈ సారి తాము నిలబడి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా చేస్తామని భావిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో యువకులు ప్రచారాన్ని మొదలు పెట్టి రాజకీయాన్ని వేడెక్కిస్తున్నారు. పార్టీలకు అతీతంగా పోటీ చేస్తామని, తాము గెలిస్తే గ్రామంలో పలానా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని చెబుతున్నారు. అర్హులైన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలను సద్వినియోగం అయ్యేలా కృషి చేస్తామని తెలియజేస్తున్నారు. ఎలాంటి అవినీతికి పాల్పడకుండా పాలన కొనసాగుతుందని, ప్రజల తరుపున ప్రశ్నించే గొంతుగా ఉంటామని గ్రామల్లో ఇప్పటి నుంచే భరోసా కల్పిస్తున్నారు.

సోషల్ మీడియాను..



నేటి రోజుల్లో జేబులో డబ్బులు లేకున్నా ప్రతి ఒక్కరికి మాత్రం ఆడ, మగ తేడా లేకుండా సెల్‌ఫోన్ తప్పనిసరైంది. దీంతో యువకులు సోషల్ మీడియాను ఎక్కువగా వాడుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి మొదలు అర్ధ రాత్రి వరకు రాజకీయంపై చర్చలు పెడుతూ, గ్రూపు చాటింగ్‌లు చేస్తూ,స్టేటస్‌లు పెట్టుకుంటూ యువకులు రాజకీయాల్లోకి వచ్చేలా ప్రత్యేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

ఆందోళనలో ఆశావహులు..

యువత ఉత్సాహంగా ఎన్నికల్లో పోటీ చేస్తామని చెబుతుండడంతో అన్ని పార్టీలలో పెద్ద లీడర్లుగా కొనసాగుతున్న వారు, కొత్తగా పోటీ చేయాలనుకుంటున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. సర్పంచ్‌లుగా,ఎంపీటీసీలుగా పోటీ చేసేందుకు అస్త్రాలను సిద్ధం చేసుకుటున్న వారికి ఈసారి ఎన్ని డబ్బులు ఖర్చు చేసినా పోటీ మాత్రం యువకులతో తీవ్రంగా ఉండనున్నట్లు మాత్రం స్పష్టమవుతోంది. యువకుల నుంచి పోటీ తప్పదని స్పష్టం కావడంతో రాజకీయాల్లో కొనసాగుతున్న ఆశావహులు గ్రామాల్లో విందు రాజకీయాలు, ఓదార్పు రాజకీయాలను మొదలుపెట్టారు. గ్రామంలో ఎవరైన మరణించినా, శుభకార్యాలు ఉన్న ఇంట్లో వాలిపోయి అన్ని కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ అష్టకష్టాలు పడుతూ వారి మన్ననలు పొందేందుకు కష్టపడుతున్నారు. ఇప్పటి వరకు ఇతర పార్టీలలో ఉంటూ సుదీర్ఘ కాలంగా ఉన్న వారితో యువకులు పంచాయతీ ఎన్నికల్లో తలపడేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో అందరి దృష్టి ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలపై పడింది.

రిజర్వేషన్ల కోసం..

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. అధికారుల వద్దకు వెళ్లి గత రిజర్వేషన్లు ఖరారు అవుతాయా లేదంటే రిజర్వేషన్లు మారుతాయా అని వాకబు చేస్తున్నారు. ఇది వరకే ఉన్న రిజర్వేషన్లనే ఈ సారి కూడా ఉంటే పోటీదారులు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అన్ని కలిసొచ్చి అనుకూలంగా రిజర్వేషన్లు వస్తే మాత్రం తప్పనిసరిగా ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని గ్రామాల్లో ఆశావహులు ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలుస్తూ మచ్చిగా చేసుకుంటున్నారు. రిజర్వేషన్లు ఖరారు అయితే మరికొంత మంది సైతం బయటకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

సైలెన్సర్లు మార్చితే చర్యలు



సైలెన్సర్లను రోడ్‌రోలర్‌తో ధ్వంసం చేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

వాంకిడి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు మార్పులు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండలంలోని టోల్‌ప్లాజా సమీపంలో శుక్రవారం అధిక శబ్దం కలిగిన 50 ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను రోడ్డురోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శబ్ద కాలుష్యాన్ని నిరోధించేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవల్‌లో భాగంగా అధిక శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగిస్తున్న 50 ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో సీఐలు బాలాజీ వరప్రసాద్, సత్యనారాయణ, రమేశ్, సంజయ్, ఎస్సైలు మధుకర్, చంద్రశేఖర్, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



పూర్తిచేసిన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తాను అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. భట్టుపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భట్టుపల్లి రోడ్డుకు గత కొన్ని సంవత్సరాల నుంచి కోర్టు స్టే ఉండడంతో పనులు చేపట్టక పోగా పూర్తిగా గుంతలతో నిండి నడువలేని పరిస్థితి ఉండేదన్నారు. ఎన్నికల సమయంలో వరినాట్లు వేసి దీన్ని రాజకీయం చేశారని అన్నారు. తాజాగా కోర్టు ఏప్రిల్ 16న 2025 స్టే ఇచ్చిందన్నారు. ు. అందవెల్లి, భట్టుపల్లి యూత్ ముందుకు వచ్చి తమకు సహకరిచాలని తనను సంప్రదించినట్టు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి తన వంతు సహకారం చేస్తామని చెప్పి పూర్తిగా రోడ్డును వేసినట్టు తెలిపారు. రోడ్డు వేసినందులకు గ్రామస్థులు, యువకులు కోనప్పను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా రక్తదానం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదానం చేయాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని బ్రహ్మకుమారి ఈశ్వరియ విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, జిల్లా వైద్యాధికారి సీతారాం, ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జోనల్ మేనేజర్, కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ స్థాయి మాస్టర్ ట్రైనర్లు తీసుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆదికర్మ యోగి మిషన్ అభియాన్ మిషన్ మోటా జోనల్ మేనేజర్ కృష్ణవేణి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న దర్తిఅభ జన జాతీయ గ్రామీణ ఉత్సవ్ అభియాన్ ఆదికర్మ యోగి మిషన్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో కలిసి మాస్టర్ టైనర్లకు శిక్షణ ధృవీకరఫ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏటీడీవోలు శ్రీనివాస్, చిరంజీవి, బి.శ్రీనివాస్, ఎస్‌సీఆర్పీలు నరేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలి

రెబ్బెన, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. 71వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బాడ్మింటన్ చాంపియన్ షిప్ మెన్ అండ్ ఉమెన్ క్రీడా పోటీలు నిర్వహించే మైదానాన్ని శుక్రవారం జీఎం పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాయమల్లు, ఏజీఎం కృష్ణమూర్తి, డీజీఎం నదీం భాషా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి, జిల్లా చీఫ్ ప్యాట్రాన్ ఆర్.నారాయణ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పనుల జాతర ప్రారంభం

తిర్యాణి/వాంకిడి/బెజ్జూరు/చింతలమానేపల్లి/కెరమెరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి, వాంకిడి, బెజ్జూరు, చింతలమానేపల్లి, కెరమెరి మండలాల్లో శుక్రవారం పనుల జాతరలో భాగంగా శుక్రవారం పౌల్ట్రీ షెడ్ ఇంకుడు గుంతలను ప్రారంభించారు. అనంతరం వంద రోజుల పని పూర్తి చేసిన కూలీలు, దివ్యాంగ కూలీలు, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. వాంకిడి మండలంలోని సరండి గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో ప్రవీణ్ పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అదే గ్రామ పంచాయతీలో సేంద్రియ ఎరువుల తయారి కేంద్రంకు భూమి పూజ చేశారు. బెజ్జూరు మండల కేంద్రంలో పనుల జాతర కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. చింతలమానేపల్లి, మండలం డబ్బా, బాలాజీఅనుకోడ, బాబాసాగర్, తదితర గ్రామాల్లో పనుల జాతర కార్యక్రమాన్ని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. కెరమెరి మండలంలో ఉపాధి హామీ పనుల జాతర కార్యక్ర మాన్ని ఎంపీడీవో అంజద్‌పాషా ప్రారంభించారు.

ఘనంగా మాజీ జడ్పీటీసీ జన్మదిన వేడుకలు

వాంకిడి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు, అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు సునీల్, సీపీఐ నాయకుడు గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50 వేలు అందజేయాలి

వాంకిడి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్ట పరిహారం అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని జైత్‌పూర్, బోర్దా గ్రామ శివారులో శుక్రవారం పంటలను పరిశీలించారు.

దీక్ష విరమించిన ఎమ్మెల్యే



దీక్షను విరమింపజేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

కాగజ్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో జీవో49ని శాశ్వతంగా రద్దు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించాలని ఐదు రోజులుగా చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్షను సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు శుక్రవారం విరమించారు. దీక్షా శిబిరాన్ని బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కె వెంకటరమణరెడ్డి(కామారెడ్డి), రాకేష్‌రెడ్డి(ఆర్మూర్), పాయల శంకర్(ఆదిలాబాద్) సందర్శించి హరీష్‌బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో చేసిన తప్పిదాలనే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. జీవో49 రద్దును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఐదురోజులుగా ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు నిరవధిక నిరాహార దీక్ష చేపడితే ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు జీవో 49 శాశ్వత రద్దుకు అసెంబ్లీలో పోరాటం చేస్తామని అన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకు దీక్షను విరమింపజేశామని తెలిపారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ జీవో 49 రద్దు, పోడు సమస్యపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, ప్రధాన కార్యదర్శులు అరిగెల మల్లికార్జున్, రాపర్తి ధనుంజయ్, ఆసిఫాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు అరిగెల నాగేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు ఆర్మీశివ, మాజీ కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్ రావు, సిందం శ్రీనివాస్, బాల్కశ్యాం, అశోక్ ఆర్యతో పాటు మండలాల కు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం..

ఎమ్మెల్యే చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా బీజేపీ నాయకులిచ్చిన పిలుపు మేరకు కాగజ్‌నగర్‌లో శుక్రవారం బంద్ ప్రశాతంగా ముగిసింది. ఈ సందర్భంగా పలు దుకాణాలు స్వచ్చందంగా మూసి వేశారు. అలాగే ప్రయివేటు పాఠశాలలు కూడా బంద్ పాటించాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం మార్కెట్‌లో తెరిచి ఉన్న పలు దుకాణాలను బంద్ చేయించారు. ఈ విషయంలో ఇద్దరు వ్యాపారుల మధ్య చిన్న పాటి ఘర్షణ ఏర్పడింది. అక్కడే ఉన్న పోలీసులు సముదాయించి ఇరువర్గాలను పంపించేశారు. కాగా పోడు సమస్యను పరిష్కరించక పోవడం జీవో 49ని పూర్తిగా రద్దు చేయక పోవడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే నివాసం ఎదుట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జీవోను శాశ్వతంగా రద్దు చేయాలని కోరారు.

ఉపాధ్యాయులపై అదనపు కలెక్టర్ ఆగ్రహం



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

సిర్పూర్(యు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుల తీరుపై అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఆగ్రహం వ్యక్త చేశారు.మండలంలోని జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాల శుక్రవారం ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు హాజరు శాతం తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు విద్యార్థులు ఇంత తక్కువ ఉన్నరన్నారు. ఉపాధ్యాయులు హాజరు పట్టిక చూశారు. ఒక ఒక నెలలోనే ఉపాధ్యాయులు 7 నుంచి 8 లీవ్‌లు తీసుకోవడం తదితర అంశాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల రికార్డులను పరిశీలించారు. అవి కూడాసక్రమంగా లేకపోవడంతో మండిపడ్డారు. ఇద్దరు ఉపాధ్యాయులకు మెమొలు ఇస్తామని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. ల్యాబ్‌లను పరిశీలించారు.ఆదర్శ పాఠశాలలో ఇంకుడు గుంత నిర్మాణానికి భూమి పూజ చేశారు. తాగు నీటి సమస్యపై అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఉపాధి హామీ పథకంలో బావి ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కృష్ణారావును ఆదేశించారు. అంతకు ముందు పాముల్వాడ గ్రామాన్ని సందర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 4 లక్షల నిధులతో మంజురు చేసిన కోళ్లఫారంను ప్రారంభించారు. చేలలోని వెళ్లడావనికి తమకు దారి లేదని అదనపు కలెక్టర్‌కు గ్రామస్థులు వివరించడంతో ఉపాధి హామీ పథకం ద్వార నిర్మించాలని ఎంపీడీవో కృష్ణారావును ఆదేశించారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు, ఎంపీడీవో కృష్ణారావు, ఎంఈవో కుడ్మేత సుధాకర్ ప్రిన్సిపాల్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా తిర్యాణి బ్లాక్‌లో అధికారులు మరింత అభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్య, వైద్య, ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమ, ఇంజనీరింగ్, గిరిజన సంక్షేమ, వ్యవసాయ, మిషన్ భగీరథ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ తిర్యాణి బ్లాక్‌లో వివిధ శాఖలకు సంబంధించిన పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. గిరిజనులకు హైపర్ టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధులకు చికిత్సలు అందంచాలని, ప్రతీ నెల గర్బిణులకు పరీక్షలు జరిపి సరైన పోషక ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, ఎంపీడీవో మల్లేష్ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్సీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

దహెగాం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం ఎమ్మెల్సీ దండె విఠల్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాబోధన, నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పలువురు పాఠశాలకు క్రీడా సామగ్రి, సోలార్ ప్యానెల్స్ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఎమ్మెల్సీ స్పందించి సమస్యల ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా వివరించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం మండలంలోని గిరివెల్లి, కర్జి, హత్తిని, దహెగాం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే గిరివెల్లిలో ఇటీవల భారీ వర్షాలతో నష్ట పోయిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, ఎంఈవో శ్రీనివాస్, వీపీసీఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, గణపతి, శ్రీరామరావు, సురేష్, భీమన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య



జైనూర్‌లో పశువులను అలంకరించిన రైతులు

సిర్పూర్(యు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రైతులు, ప్రజలు పొలాల అమావాస్యను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయా గ్రామలలో గల హన్మన్ ఆలయలలో రైతులు,ప్రజలు ఉదయం నుంచే పూజలు కార్యక్రమాలు నిర్వహించారు.మండల కేంద్రంలో గల హన్మన్ సాయి బాబా ఆలయంలో గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావు అధ్వర్యంలో ఆత్రం నీతిన్‌కుమార్,ఆత్రం ఓంప్రకాష్,ఆత్రం గంగారాం,ఆత్రం విజయ్ కుమార్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామాల్లో పొలాల పండుగను రైతులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పశువులను అలంకరించి హనుమాన్ మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. పవర్‌గూడలో పటేల్ అనక హన్మంతు, అనక రాంజీ ప్రత్యేక పూజలు చేశారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పొలాల అమావాస్య వేడకలను రైతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులను ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఆలయాల్లో పశువులతో ప్రదక్షిణలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్దండి గ్రామంలో శుక్ర వారం ఘనంగా పొలాల పండగను ఘనంగా జరుపుకన్నారు. పొలాల అమావాస్య రోజున రైతులు తమకు వ్యవసాయంలో చేదోగా ఉంటున్న పశువులను అలంకరించి ఊరేగింపు చేసి ఆలయాలకు తీసుకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం అనవాయితీ. ఇందులో భాగంగా వీర్దండి గ్రామంలో పొలాల అమావాస్య పండగను నిర్వహించారు.

బ్యాంకు స్కామ్‌పై కొనసాగుతున్న విచారణ

చెన్నూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎస్‌బీఐ బ్యాంకు-2లో జరిగిన స్కామ్‌పై రెండవ రోజైన శుక్రవారం విచారణ కొనసాగింది. బ్యాంకు ఉన్నతాధికారులు హైద్రాబాద్ నుంచి ఇక్కడకు చేరుకుని ఆడిట్‌ను పరిశీలించారు. పోలీసు బందోబస్తు మధ్య బ్యాంకు అధికారులు ఆడిట్ నిర్వహిస్తున్నారు. అయితే ఎంత స్కామ్ జరిగింది, ఇందులో బంగారం ఎంత, నగదు ఎంత అనేది పూర్తిస్థాయిలో వెల్లడి కాలేదు. గోల్డ్ తనాఖా పెట్టి లోన్ తీసుకున్న వారు వారి వద్ద రిసీప్ట్ రశీదు జిరాక్స్ కాపీలను బ్యాంకు అధికారులకు అందించారు. ఇప్పటికీ సుమారు 450 మంది గోల్డ్‌లోన్ బాధితులు ఉన్నట్లు సమాచారం. ముందుగా సుమారు రూ. 3 కోట్ల స్కామ్ జరిగిందని అనుమానాలు తలెత్తినా, బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో మొత్తంగా రూపాయలు 12 కోట్ల 50లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. బంగారాన్ని లా కర్లలో భద్రపర్చు కున్న ఖాతాదారులు బ్యాంకుకు చేరుకుని లాకర్లలోని బంగారాన్ని తీసుకువెళ్లారు.

బాధితుల ఆందోళన

బంగారం తనాఖా పెట్టి రుణాలు తీసుకున్న ఖాతాదారులతో పాటు ఎఫ్‌డీలు పెట్టిన ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. నమ్మకంగా ఉండే బ్యాంకుల్లో అధికారులే సూత్ర దారులై తమ సొమ్మును, బంగారాన్ని దిగమింగేస్తే తాము ఎక్కడ పోతామని పలువురు ఖాతాదారులు ప్రశ్నించారు. ఆడిట్ కొనసాగుతుండడం, పోలీసుల బందోబస్తు ఉండడంతో ఖాతాదారులను ఎవర్ని బ్యాంకు లోపలికి అనుమతించడం లేదు.

పోలీసుల అదుపులో నలుగురు

బ్యాంకు స్కామ్‌లో ప్రధాన సూత్రధారి క్యాషియర్ రవీందర్‌పై అనుమానాలు వ్యక్తమవుతుండగా ఆయన మిత్రులు, కుటుంబీకులు , బంధువులపై పోలీసులు నిఘా పెట్టారు. మరో వైపు క్యాషియర్ రవీందర్ తనకు సంబంధించిన నలుగురు వ్యక్తుల అకౌంట్‌లకు డబ్బులు బదిలీ చేశారని తేలడంతో ఆ నలుగురినీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే క్యాషియర్ ఎక్కడున్నాడనే దానిపై పోలీసు బృందాలు జల్లెడ పడుతున్నాయి. మరో వైపు ఈ స్కామ్ కోట్లలో ఉండడంతో సంబంధిత బ్యాంకు శాఖకు సంబంధించి డిల్లీ నుంచి ప్రత్యేక బృందం చెన్నూరుకు రానున్నట్లు సమాచారం. ఆడిట్ కొనసాగుతున్నందున దీనిపై ఇప్పుడే ఏమి చెప్పలేమని మంచిర్యాల డీసీపీ భాస్కర్‌పేర్కొన్నారు.

మంత్రి ఆరా..

ఎస్‌బీఐ బ్యాంకు 2లో జరిగిన స్కామ్‌కు సంబంధించిన రాష్ట్ర మైనింగ్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆరా తీశారు. శుక్రవారం చెన్నూరుకు వచ్చిన సందర్భంగా క్యాంపు కార్యాలయానికి మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లును పిలిపించుకుని వివరాలను తెలుసుకున్నారు. దీనిపై సత్వరమే విచారణ చేసి బాధితులకు అన్యాయం జరగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జైపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రసూల్‌పల్లి బస్టాండ్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం చెన్నూరు మండలంలోని కిష్టంపేటకు చెందిన నస్పూరి తిరుపతి, బండారి రవి పని నిమిత్తం బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో బైక్ ప్రమాదవశాత్తూ అదుపు తప్పి డివైడర్‌కు తగలడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు



సైక్లింగ్‌తో ఉపయోగాలెన్నో



● ఆరోగ్య ప్రయోజనాలు మెండు ● పర్యావరణానికి తోడ్పాటు

కౌటాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉండా లంటే వ్యాయామం అత్యంత ప్రధానం. అలాంటి వాటి లో సైక్లింగ్ ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతు న్నారు. మూడు పదులు నిండక ముందే కీళ్ల నొప్పులు.. కాసింత నడుస్తారో లేదా అయాసం.. మూడడుగులు వేయక ముందే మోకాళ్ల నొప్పులు. ఇలా అనేక రకాల సమస్యలతో సతమతమయ్యే వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. ఇందుకు ప్రధాన కారణంగా ఒంటికి సరైన వ్యాయామం లేక పోవడమే కాకుండా చీటికి మాటికి వాహనాలను వినియోగించడం కూరగాయలు కొనాలన్నా, పాల ప్యాకెట్ తేవాలన్నా ఆఖరికి ప్లే గ్రౌం డ్స్‌కి వెళ్లాలన్నా బైక్ వెంట ఈసుకెళ్లాల్సిందే. వ్యాయా మానికి ఉపకరించే ఎలాంటి నిర్వహణ ఖర్చు లేని పేదోడి వాహనం సైకిల్‌ను తొక్కే వారి సంఖ్య ఏటేటా తగ్గిపోతుంది. వాహనాలను వినియోగించే వారి సంఖ్య మాత్రం పెరిగి పోతూ వాతావరణం కాలుష్యమ వుతుం ది. దీంతో పలురకాల ఆరోగ్య సమస్యలతో ఎంతో మంది బాధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సైకిల్‌ను వాడితే ఆరోగ్యం ఖర్చు లేకుండా పొదుపుతో పాటు పర్యావరణ హితులుగా నిలిచే అవకాశం ఉంటుంది.

● అనారోగ్య సమస్యలకు చెక్..

సైకిల్ ఎలాంటి ఇంధనఖర్చు అవసరం లేని వాహనం. కాలంతో పాటు పరుగె త్తుతున్న ఈ నాటి పరిస్థితుల్లో మోటారు వాహనాల వినియోగం పెరిగిపోతుంది. ద్విచక్రవాహనాల వినియోగంతో పనిసులువుగా అయిపోవడమే కాకుండా ఎలాంటిశ్రమ లేకుండా పని పూర్తిచేయొచ్చనే భావన నేటితరంలో అధికమైంది. దీంతో రెండు దశాబ్దాల క్రితం దాకా ఆరోగ్య ప్రధాయినిగా నిలిచిన సైకిల్‌ను ఇప్పుడు చాలామంది చులకనగా చూస్తున్నారు. సైకిల్ వినియోగించే వారిసంఖ్య పడిపోతుంది. అయితే సైకిల్ వాడ కంతో అనేకరకాల వ్యాధులకు చెక్‌పెట్టవచ్చు. ప్రధానంగా మధుమేహం వ్యాధిగ్రస్తులు సైకిల్ తొక్కడంవల్ల షుగర్ అదుపులో ఉంటుంది. దీంతో పాటు ఖరీదైన పెట్రోల్ వాడకం తగ్గించుకునే పొదుపు మంత్రంతో విదేశీమారకద్రవ్యాన్ని సైతం మిగిల్చిన వారమవుతాం.

● ఆరోగ్యానికి మేలు..

సైకిల్ తొక్కడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరు గుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు సైకిల్ వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాయి. సైకిల్ తొక్కడంతో గంటకు సుమారు 300 కేలీల శక్తి ఖర్చవుతుంది. తద్వారా శరీరంలో కొవ్వు పేరుకోకుండా ఉపయోగపడుతుంది. స్థూలకాయలకు ఇది మంచి వ్యాయామంగా పని చేస్తుంది. ప్రతి వందలో 10 నుంచి 15 మంది వరకు ఊబకాయంతో బాధపడుతున్నారు. అయితే వీరంతా చీటికి మాటికటి మోటారు వాహనాలను వినియోగిస్తున్న వారు కావడం గమనార్హం. ఇలాంటి వారు సైకిల్ తొక్కడంవల్ల కొవ్వు తగ్గించుకుని ఆరోగ్యంగా ఉంటారు. నిత్యం సైకిల్‌ను సవారీ చేయడం వల్ల గుండె, ఊపిరితిత్తులు, నాడీ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. మామూలు వారికంటే సైకిల్ తొక్కేవాళ్లు చురుగ్గా కని పిస్తుంటారు. ప్రతిరోజు ఉదయం కొద్ది సేపు సైక్లింగ్ చేయడంతో హృదయ సం బంధిత సమస్యలు దూరమవుతాయని గుండె వైద్య నిపుణులు చెబుతున్నారు.



● పలు రకాల ప్రయోజనాలు..

సైకిల్ వినియోగంతో పలురకాల ప్రయోజనాలు చేకూరుతాయి. దీనివల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది. మోటారు వాహనాల వినియోగం తగ్గించ డంతో పాటు ఇంధన వినియోగాన్ని అదుపులో పెట్టుకోవచ్చు. సాధారనంగా ఏ వాహనంలో కూడా వంద శాతం ఇంధనాన్ని వినియోగించుకునే పరిస్థితులు ఉండవు. దానిలో సరాసరి రెండోవంతు గాలిలోకలిసి పర్యావరణానికి ప్రమాద కరంగా మారుతుంది. దీంతో పాటు వాహనాల నుంచి వెలువడే పొగతో ఊపిరి తిత్తులకు సంబం ధించిన సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో సైకిల్‌ను వినియోగిస్తే ఎలాంటి సమస్యలు ఉండక పోవడమే కాకుండా పెరుగు తున్న ఆర్థిక భారాన్ని నియంత్రించే వీలుంటుంది. ఇందు కోసం ఇప్పుడు అనేక దేశాల్లో సైకిల్ వినియోగంవల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కొంత మంది పర్యావ రణ హితులు వేల కిలో మీటర్ల దూరం సైకిల్ యాత్రను చేపడుతూ అవగాహన కల్పిస్తుండడం విశేషం.

రాళ్లవాగులో పడి వృద్ధుడి మృతి

మంచిర్యాలక్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రాళ్లవాగులో గౌతమినగర్‌కు చెందిన గొల్ల చిన్న గంగయ్య(64) అనే వృద్ధుడు పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ మజారోద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొద్ది రోజులుగా మతి స్థిమితం లేక ఇంటిలో నుంచి బయటకు వెళ్లి తిరుగుతూ వస్తుండేవాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. ఈ క్రమంలో వాగులో అతడి మృతదేహాన్ని గుర్తించారు. గంగయ్య కుమారుడు రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెట్రోల్ బంకులో అగ్నిప్రమాదం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో శుక్రవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బంకులోకి ఆఫీస్ కార్యాలయంలో షార్ట్‌సర్క్యూట్ సంభవించడం వల్ల ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ అధికారి కార్తీక్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. మంటలకు పొగ పరిసరాల ప్రాంతాలను కమ్మివేసింది. ఫైర్ అధికారి కార్తీక్ మాట్లాడుతూ కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్‌తో పాటు కంప్యూటర్‌తో పాటు ఇతర సామగ్రి కాలిపోయిందని చెప్పారు. ప్రమాదంలో కాలిపోయిన ఆస్తుల నష్టాన్ని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు తేలలేదని తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

కౌటాల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని సదాశివపేటలో గత నెలలో ఎడ్ల తిరుపతి అనే ఉపాధ్యాయుడి ఇంట్లో దొంగతనానికి ప్రయత్నించి ఇద్దరి నిందితుల్లో ఒకరైన సమీర్ మండల్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విజయ్ తెలిపారు.గత నెలలో ఎడ్ల తిరుపతి ఇంట్లో లేని సమయంలో సమీర్ మండల్ తో పాటు మరో వ్యక్తి దొంగతానికి పాల్పడ్డారని చెప్పారు. అదే సమయంలో తిరుపతి ఇంటికి రాగా దొంగలను పట్టుకునే ప్రయత్నంలో వారు పారిపోయారని వారిలో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వంద రోజులు పని కల్పిస్తాం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పాటు కల్పిస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గ్రామ పంచాయతీలలో రూ. 2,149 కోట్లతో నిర్వహిస్తున్న పనుల జాతర జిల్లాలో ప్రారంభమైంది. ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి గ్రామ పంచాయతీ భవనానికి, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం(ఇంకుడు గుంత)కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పని కల్పించే లక్ష్యంతో పనుల జాతర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలోని 15 మండలాల్లోని 335 గ్రామ పంచాయతీల్లో 951 వివిధ రకాల అభివృద్ధి పనులను చేయనున్నట్లు వివరించారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలో వంద రోజుల పని చేసిన ఉపాధి హామీ కూలీలను సన్మానిం చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డీఆర్డీవో దత్తారావు, డీపీవో భిక్షపతి, డీఎల్‌పీవో ఉమర్‌హుస్సేన్, తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మౌనిక, టీఏ మల్లుబాయి, కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వంద రోజులుపని పూర్తి చేసిన ఉపాధి హామీ కూలీలు స్వరూప, బండారి నందాబాయిని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సన్మానించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణ, జామ్నిలో ఇంకుడు గుంతలు, పశువుల కొట్టాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ కుడమెత విశ్వనాథ్‌రావు, సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోహన్, ఏపీవో నగేష్, ఈసీ అంకుష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

యువతిని వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

మందమర్రిటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువతికి నకిలీ ఈమెయిల్ ఐడీ ద్వారా అసభ్యకర అశ్లీల సందేశాలు పంపిస్తూ మానసికంగా వేధిస్తున్న ఓ వ్యక్తిని మందమర్రి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వివరాలను సీఐ శశిధర్‌రెడ్డి వెల డించారు. పట్టణానికి చెందిన యువతికి ఈ మెయిడ్‌ఐడీ ద్వారా అసభ్యకర సందేశాలను పంపుతున్నాడు. దీంతో యువతి కొద్ది రోజుల కింద ఫిర్యాదు చేసిందని తెలిపారు. యువతి ఫిర్యాదు మేరకు మందమర్రి ఎస్‌ఐ రాజశేఖర్ ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన నిఖిల్‌బాబు నిందితుడని గుర్తించామన్నారు. హైద్రాబాద్‌లో యువతి పనిచేస్తున్నప్పుడు నిఖిల్ బాబు సహోద్యోగి అని, యువతిని ప్రేమిస్తున్నానని చెప్పడంతో ఆమె తిరస్కరించగా కోపంతో కక్ష పెంచుకుని ఇలాంటి సంఘటనలకు పాల్పడ్డాడని తెలిపారు. శుక్రవారం నిఖిల్‌బాబును అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

జైనూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐ వెల్పుల రమేశ్, ఎస్సై రవికుమార్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పార్వతీబాయి పాల్గొన్నారు.

ఉత్తమ గనులకు బహుమతులు అందజేస్తాం

శ్రీరాంపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ గనులకు బహుమతులు అందజేస్తామని జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయం లో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రక్షణ బహుమతుల ప్రదానోత్సవాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. సింగరేణి వ్యాప్తంగా ఎంపికైన ఉత్తమ గనులకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ నెల 30వ తేదీన సాయంత్రం శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో వేడుకలు జరుగుతాయని అన్నారు. డీజీఎంఎస్(రక్షణ) ఉజ్వల థా, డీడీఎంఎస్ ఖన్నన్, సింగరేణి సీఎండీ ఎన్. బలరాం, డైరెక్టర్లు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులు రానున్నారని తెలిపారు. కాగా ఈ నెల 31న రక్షణ ట్రైపార్టీయేట్ సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ తెలిపారు. కంపెనీ వ్యాప్తంగా ఉన్న రక్షణ సమస్యలు, పరికరాలు, తదితర సమస్యలపై సమీక్ష ఉంటుం దన్నారు. శ్రీరాంపూర్‌లో నిర్వహించే ఈ సమావేశంలో డీడీఎంఎస్, డీజీఎంఎస్, సింగరేణి సీఎండీ, డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలు. గుర్తింపు సంఘం, అధికారుల సంఘం నాయకులు, కాంట్రాక్ట్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

జీఎం కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే రక్షణ బహుమతుల ప్రదా నోత్సవంపై ఏరియా జీఎం శ్రీనివాస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అధికారులు హాజరయ్యే వేడుకలను విజయవంతం చేసేందుకు తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్లాలన్నారు. బహుమతుల ప్రదానంతో పాటు సంస్కృతి కార్యక్రమాలుంటాయని చెప్పారు. విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, డీజీఎం(పర్సనల్) రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్ రావు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు బండి రమేష్, సీఐటీయూ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, బీఎంఎస్ ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, హెచ్‌ఎంఎస్ కార్యదర్శి అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

ట్రాక్‌లైన్ సమస్యతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం

శ్రీరాంపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ట్రాక్‌లైన్ సమస్యతో ఉత్పత్తికి విఘాతం కలుగుతోందని కార్మికులు అన్నారు. ఎస్‌ఆర్‌పీ 3 గనిని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చారు. ట్రాక్‌లైన్ సమస్యతో పాటు టబ్ వీల్స్ సక్రమంగా లేకపోవడం వల్ల ప్రతి రోజు ట్రబ్బులు పడిపోతున్నాయని, బ్యాంక్ హెడ్, మెయిన్ ఇంక్లైన్‌లో కట్ ప్లేట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల టబ్బులు పడిపోవడం, ట్రాక్ నుంచి దిగిపోవడం జరుగుతుందన్నారు. లైన్మెన్లకు కావాల్సిన తుంటలు, లైనర్స్, ఐ బోల్టులు, గుట్కలు అందించాలని, ట్రామర్లకు అవసరమైన ఐరన్ జాములు, లూబ్రికేషన్ ఆయిల్ సక్రమంగా సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారులు దృష్టి సారించాలని కోరారు. అనంతరం బాజీసైదా మాట్లాడుతూ, గతంలో కార్మికులు ఇవే సమస్యలు తెలుపగా, తాము మేనేజర్ దృష్టికి తీసుకెళ్లామని, అయినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం చర్చల కమిటీ ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, అడ్డు శ్రీనివాస్, పిట్ కార్యదర్శి మురళి చౌదరి, సహాయ కార్యదర్శి అంబాల రవి, తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

రెబ్బెన, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఉపరితలంతో పాటు వట్టివాగు రక్షణ కట్ట నిర్మాణ పనులను హైదరాబాద్ రీజియన్ 2డీఎంఎస్(డైరెక్టర్ మైన్ సేఫ్టీ) అధికారి నాగేశ్వర్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం మైనింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జీఎం విజయభాస్కర్ రెడ్డి, ఎస్‌ఓటు జీఎం కె రాజమల్లు, పీఓ ఎన్ ఉమాకాంత్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద కార్మికులకు వేతన ఖాతాలు

జైపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ఆదేశాలమేరకు ఎస్టీపీపీలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా వేతన ఖాతాలను ఇప్పించామని డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా ఒప్పంద కార్మికులకు శుక్రవారం ఖాతాలను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సాలరీ ఖాతాల ద్వారా కాంట్రాక్టు కార్మికుడు ప్రమాదంలో మరణిస్తే రూ. 40 లక్షల బీమావర్తింసుందన్నారు. పాక్షిక , శాశ్వత అంగవైకల్యం సంభవిస్తే రూ. 40 లక్షల భీమా వస్తుందన్నారు. జీరో మినిమం బ్యాలెన్స్, డెబిట్ కార్డు చార్జీలు ఉండవని తెలిపారు. ఖాతాలు తప్పని సరిగా తీసుకోవాలని ఆయన సూచించారు., కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ఠాకూర్ మోహన్‌సింగ్, పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారిణి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

జైపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భూగర్భ ఉపరితల గనుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ నాగేశ్వర్‌రావు అన్నారు. శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘుకుమార్‌తో కలిసి ఐకే 1ఏ, ఓసీపీ గనులను శుక్రవారం సందర్శించారు. డైరెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు రక్షణ సూత్రాలను పాటిస్తూ రక్షణ పరికరాలను ఉపయోగిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకతో పాటు రక్షణతో పనిచేయడం ముఖ్యమన్నారు. ఓసీపీ పరిసర ప్రాంతంలో ఉన్న గోదావరి రక్షణ కరకట్టను పరిశీలించారు. వర్షాకాలంలో ఎటువంటి ఆటంకం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కరకట్టను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా రక్షణాధికారి విజయ్‌కుమార్, ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న పెద్దపులి

● రెండు నెలల్లో పది పశువులు మృతి
● భయాందోళనలో గ్రామస్థులు

కాసిపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మూడు ఫారెస్టు రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంత గ్రామ ప్రజలతో పాటు పశువుల కాపరులను పెద్దపులి హడలెత్తిస్తోంది. జరిగిన రెండు నెలల్లో ఆవుల మందలపై దాడి చేసిన పెద్దపులి పది పశువులను చంపింది. దీంతో పశువుల కాపరులు అడవుల్లోకి వెళ్లేందుకు జంకుతున్నారు. మహారాష్ట్రలోని తిప్టేశ్వర్ నుంచి ఈ ఏడాది జూన్ 8న తెలంగాణలోకి వచ్చింది. ఆదిలాబాద్ ఫారెస్టు డివిజన్ మానిక్‌గడ్ బ్లాక్ నుంచి కెరమెరి అటవీ రేంజ్‌లోకి వచ్చింది. అనంతరం జోడేఘాట్ అటవీ రేంజ్ నుంచి తిర్యాని అటవీ రేంజ్‌లోకి ప్రవేశించింది. ఇప్పుడు అందరిని హడలెత్తిస్తుంది. గడిచిన రెండు నెలల్లో పది పశువులను చంపిన పెద్దపులి అటవీశాఖ అధికారులకు కంటిలోకునుకు లేకుండా చేస్తోంది. దీని సంరక్షణతో పాటు గ్రా మాల్లోకి పులిరాకుండా అటవీ శాఖ అధికారులు తగు చర్యలు చేపడుతున్నారు.

తిర్యాణి అటవీ రేంజ్‌లోనికి..

జూన్‌లో తిర్యాణి అటవీ రేంజ్‌లోకి ప్రవేశించిన పెద్దపులి దేవాపూర్, బెల్లంపల్లి అటవీ రేంజ్‌లను అవాసంగా చేసుకొని సంచరిస్తుంది. పులి అవాసానికి ఈ మూడు రేంజ్‌లు అనుకూలమైనప్పటికీ పశువుల మందలపై దాడులు చేయడం అందరిని ఆందోళనకు గురి చేస్తోంది. తిర్యాని అటవీరేంజ్ పరిధిలో ఐదు ఆవులను చంపగా బెల్లంపల్లి రేంజ్ పరిధిలోని వెంకటాపూర్ బీట్‌లో జులై 7న ఒక ఆవుని చంపింది. జూలై 27న ధర్మరావుపేట బీట్‌లో మరలేగదూడను చంపింది. ఇదిలా ఉండగా బుధవారం దేవాపూర్ అటవీరేంజ్ పరిధిలోని రొంపెల్లి బీట్‌లో ఒక ఎద్దు, ఆవు, లేగదూడలను ఏకకాలంలో చంపడంపై అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రొంపెల్లి బీట్‌లో లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు(ఫైల్)

పులికి హాని తలపెట్టవద్దు..

వన్యప్రాణులకు ఎవరు కూడ హాని తలపెట్టవద్దు. పులలు అడవిలో తిరగడం వల్లనే అడవులు విస్తరిస్తాయి. దీంతో వర్షాలు సమృద్ధిగా కురిసి వాతావరణం సమతుల్యంగా కాపాడబడుతుంది. అడవులతోనే మానవ మనుగడ ముడిపడి ఉంది. కాబట్టి వన్య ప్రాణులు అడవుల్లో స్వేచ్ఛ బతికే అవకాశాలు కల్పించాలి. ఎవరైనా వన్యప్రాణులకు హాని తలపెడితే వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కఠిన చర్యలు ఉంటాయి. వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతగా భావించాలి.

\- అనిత, దేవాపూర్ ఫారెస్టు రేంజ్ అధికారి

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ట్రైబల్ మోడల్ స్పోర్ట్స్ పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం అండర్-14, 16, 18, 10 బాలబాలికల అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 150 మంది పాల్గొనగా ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేశామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30, 31 తేదీల్లో మహబుబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటార్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, పీఈటీ యాదగిరి, లక్ష్మి, సరోజ, శ్రీనివాస్, ప్రభాకర్, రాజేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

జైనూర్, ఆగస్టు 22 (ఆగస్టు22): మండలంలోని జామిని ప్రాథమికోన్నత పాఠశాలలో తాత్కాలిక పద్ధతిన ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో జాదవ్ మధుకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

మందమర్రిరూరల్ : మండలంలోని శంకర్‌పల్లి గ్రామంలో శుక్రవారం కొత్తగా చేపట్టబోయే ఉపాధి హామీపనులను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. గ్రామపంచాయతీల్లో వంద రోజులు పనులు పూర్తి చేసిన కూలీని, దివ్యాంగులను, పారిశుధ్య కార్మికున్ని ఘనంగా సన్మానించారు. ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో రజియాసుల్తానా పాల్గొన్నారు.

వేమనపల్లి : మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు తప్పనిసరిగా కేవైసీని అప్‌డేట్ చేసుకోవాలని బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

●మండలంలోని మంగెనపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజేష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ అన్వేష్, సూపర్‌వైజర్ అపరంజి, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, సెక్రటరీ శ్యామ్, ఏఎన్ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి(లక్షెట్టిపేట): లక్షెట్టిపేట పట్టణంలో గోదావరి రోడ్డు చెందిన శ్రీరాముల రాజేశం సాటుసార కేసులో బైండోవర్ ఉల్లంఘించినందుకు ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు లక్షెట్టిపేట ఎక్సైజ్ శాఖ సీఐ సమ్మయ్య తెలిపారు.

కన్నెపల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకులు మాధవరపునర్సింగరావు జన్మదిన వేడుకలను శుక్రవారం కన్నెపల్లిలో ఘనంగా నిర్వహించారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలోని విద్యార్థినులకు అరుణ ఆసుపత్రి, లయన్స్‌క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో డాక్టర్ అనూష, కంటి వైద్య నిపుణులు అంజయ్యలు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

కాసిపేట: జిల్లా వ్యాప్తంగా 44 ప్రీ ప్రైమరి స్కూళ్లలో కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఏజెన్సీ ప్రాంతంలోని స్కూళ్లలో ఎస్టీలకే ప్రాధాన్యత ఇచ్చి ఎంపిక చేయాలని తుడుం దెబ్బ జిల్లా గౌరవ అధ్యక్షులు పెంద్రం హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో బెల్లంపల్లికి చెందిన మహమ్మద్ ముదస్సర్(39) కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహమ్మద్ ముదస్సర్ 2007లో హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డాడు. అప్పుడప్పుడు బెల్లంపల్లికి వచ్చి వెళ్తుండేవాడు. కొద్ది రోజుల కిందట ముదస్సర్ తండ్రి మహ్మద్ సాదిక్‌పాషాకు మృతుడి స్నేహితులు ఫోన్ చేసి ముదస్సర్‌కు 5లక్షల అప్పు అయిందని, బాధపడుతున్నా డని తెలిపారు. దీంతో తండ్రి వెంటనే ముదస్సర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. ఆగస్టు 1న ముదస్సర్ తండ్రికి ఫోన్ చేసి వారం రోజుల్లో ఇంటికి వస్తున్నట్లు చెప్పాడు. ముదస్సర్ శుక్రవారం 11 గంటలకు అతని స్నేహితుడికి ఫోన్ చేసి చనిపోతున్నానని ఫోన్ కట్ చేశాడు. దీంతో విషయం పోలీసులకు చెప్పడంతో ముదస్సర్ ఫోన్ లోకేషన్ కరీంనగర్ శ్వేతహోటల్‌గా గుర్తించారు. కుటుంబ సభ్యులు వెళ్లేసరికి హోటల్‌లో ఉరివేసుకుని ఉన్నాడు. సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● స్వయం సహాయక సభ్యులకు చేకూరనున్న ప్రయోజనం
● ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షల పరిహారం
● ఆర్థికంగా చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం




దండేపల్లిలో గ్రామైఖ్య సంఘం సభ్యులు

వనితకు బీమా.. కుటుంబానికి ధీమా

దండేపల్లి ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అతివల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారి ప్రమాద బీమాను 2029 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రమాద సమయంలో భరోసా కల్పించినట్లయింది. అందులో సభ్యులుగా ఉన్నవారిలో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ 10లక్షల బీమా పరిహారం పొందే సౌలభ్యం ఉంది.

మహిళా సంఘాలకు ప్రయోజనకరం

దండేపల్లి మండలంలో 47వివో, చిన్న సంఘాలు 1036 సంఘాలలో 11,120 మంది సభ్యులు ఉన్నారు. అర్హత కలిగిన ప్రతీ మహిళ స్వయం సహాయ సంఘాల్లో చేరాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించి ప్రోత్సహిస్తోంది. సంఘం సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకుని చిరు వ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు లింకేజీకి స్త్రీనిధి, మహిళా శక్తి పథకాల ద్వారా వివిధ రకాల రుణాలను అందజేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆయాయూనిట్లు, ఉపాధి అవకాశాలు నెలకొల్పి ఉపాధి పొందుతున్నారు. ప్రమాద బీమాను పెంచుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బీమా పథకం స్త్రీ నిధి పథకం ద్వారా అమలు జరుగుతుందని స్పష్టం చేశారు.

సహజ మరణానికి

మహిళలను మహారాణులుగా చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేకంగా వివిధ పథకాల రూపకల్పన చేస్తోంది. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీ నిధి రుణాలను అందిస్తూ వారు స్వశక్తితో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రోత్సాహిస్తున్నారు. సంఘంలో సభ్యులకు ప్రత్యేకంగా రుణ, ప్రమాదబీమా పథకాలను అమలయ్యేలా చర్యలు చేపట్టింది. రుణ బీమా పథకంలో సహజమరణం సంభవిస్తే రూ.2లక్షలు, ప్రమాదవశాత్తు అయితే రూ.10లక్షలవరకు బీమా అందించనుంది.

ఆర్థికంగా చేయూత

స్వయం సహాయకసంఘాల సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రమాద బీమా పథకాన్ని మరోనాలుగేళ్ల పాటు పొడగించింది. సహాయక బృందాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబనకు, సామాజిక సాధికారితకు కీలకమైన వేదికలు, వీరిద్వారా మహిళలలు చిన్న తరహా వ్యాపారులు ప్రారంభించుకో వడంతో పాటు, పొదుపును ప్రోత్సహిస్తున్నారు. తద్వారా తమ కుటుంబాలకు ఆర్థిక చేయూత నిస్తున్నారు. సంఘంలో సభ్యులకు ఏవైనాఅనుకోని సంఘటనలు ఎదురైతే వారి కుటుంబాల భవిష్యత్తును చీకటిమయం చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ కుటుంబాలకు అండగా ఉండేందుకు బీమాను ప్రభుత్వం తీసు కువచ్చింది.

రుణ మాఫీ

సంఘం సభ్యురాలు ప్రమాదశాత్తు మరణిస్తే ప్రభుత్వం అందించే రూ 10లక్షలు నామినీ ఖాతాల్లో జమ చేస్తారు. అంతే కాకుండా వారికి సంబంధించిన రుణాన్ని మాఫీ చేస్తారు. 50శాతం మించిన అంగవైకల్యం ఏర్పడితే సదరం ధృవపత్రం ద్వారా పరిశీలించి రూ 5 లక్షలు అందజేయనున్నారు. ఈపథకం ప్రారంభించక ముందు రుణం పొందివారు మరణిస్తే, వడ్డీతో కలిపి చెల్లించాల్సిన బాధ్యత కుటుంబీకులు, సంఘం సభ్యులపై పడేది.

బీమాకు అర్హులు

జిల్లా గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో 18 నుంచి 59 ఏళ్ల వారు స్వయం సహాయ సభ్యురాలిగా ఉన్నవారికి బీమా వర్తిస్తుంది. పథకాన్ని గతేడాది మార్చి 14 ప్రారంభించారు. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకున్న వారు మరణిస్తే వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుంది.

అవగాహన అవసరం

ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు పథకాలలో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపుల వారు నెలవారి సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన వివరాలు నిధి పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి.

మహిళలకు బీమా ప్రయోజనకరం



సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళలకు బీమా సౌకర్యం కల్పించడంతో ఎంతో ప్రయోజనకరంగా మా రింది. వారి కుటుంబాలకు రుణం ఇచ్చిన బ్యాంక్‌కు ఆ ర్థిక భరోసా లభిస్తుంది. బ్యాంక్ లింకేజికి కూడా వ ర్తింపజేస్తారు. మహిళా సంఘ సభ్యులందరికి బీమా చె ల్లించేకునే విధంగా ఇప్పటికే వారికి అవగాహన కల్పించాము.

- తోట లక్ష్మి ఐకేపీ ఏపీఎం దండేపల్లి

మహిళలు సంఘాల్లో చేరండి



అతివలు మహిళా సమైఖ్య సంఘంలో చేరండి ప్రభుత్వం ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోని ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందిస్తుంది. స్వశక్తితో ఎదిగేలా చేస్తుంది. సంఘం సభ్యుల్లో ఎవరైనా ప్రమాదశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 10లక్షల బీమా డబ్బులు అందజేస్తుంది. తద్వారా బాధిత కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తుంది.

- అల్లంల అనిత జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు

ప్రభుత్వం జానపద కళాకారులను ప్రోత్సహించాలి

బెల్లంపల్లి, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జానపద కళాకారులను, జానపద కళలను ప్రోత్స హించాలని రాష్ట్ర జానద కళాకారుల సంఘం కార్య దర్శి హనుమాండ్ల మధూకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని కళాకారులతో కలిసి కేక్‌కట్ చేసి మాట్లాడారు. జానపద కళాకారులకు జీవనోపాధిని కల్పించే విదంగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. పండుగలు, జాతరల సందర్భంగా కళాకారులతో సంస్కృతిక కార్య క్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రజలను వివిధ అంశాలపై చైతన్యపరిచేది కళాకారులేనని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల విషయంలో కళాకారులకు ప్రాముఖ్యత కల్పించాలన్నారు. సీనియర్ కళాకారులు రాంచందర్, రాజేశ్, మల్లేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

బెల్లంపల్లి, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపు మేరకు చలో సచివాలయం సేవ్ తెలంగాణ శుక్రవారం కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులను బెల్లంపల్లి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ మాట్లాడుతూ పలు ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయం వెళ్తున్న బీజేపీ నాయకులను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. అరెస్టయిన వారిలో జిల్లా కార్యదర్శి గోవర్ధన్, బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణ ప్రధాన కార్యదర్శి అరవింద్‌లు ఉన్నారు.

నెన్నెల : రాష్ట్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండల బీజేపీ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండల పార్టీ అధ్యక్షులు అంగళి శేఖర్, మాజీ అధ్యక్షుడు శైలెందర్‌సింగ్ అరెస్టు అయిన వారిలో ఉన్నారు. సొంత పూచికత్తుపై వారిని విడుదల చేశారు.

కాసిపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఇచ్చిన పిలుపు మేరకు చలో సచివాలయం పిలుపులో భాగంగా వెళ్తున్న బీజేపీ మండల అధ్యక్షులు సూరం సంపత్‌ను, కార్యకర్తలను కాసిపేట పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు.

ఇటీవల పడిన వర్షాలకు రోడ్లు, డ్రైనేజీలు వ్యవస్థను బాగు చేయాలని చలో సచివాలయం కార్యాక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వెళ్తున్న ప్రధాన కార్యదర్శి రెడ్డి బాల్‌రాజు, దోమల రాంచందర్, చొప్పదండి విష్ణువర్ధన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్

వేమనపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీల్వాయి గ్రామంలో గల కొత్తగూడెంలో వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. రూ. 12 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రానికి, లక్ష రూపాయలతో పశువుల పాక, రూ. 3 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్‌లకు భూమి పూజ చేశారు. అలాగే మంగెన పల్లిలోరూ. 7 లక్షలతో ప్రాథమిక పాఠశాలకు, రూ. 8లక్షలతో సూరారం పాఠశాలకు కాంపౌండ్‌వాల్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆకుల లింగాగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు గణపతి, రాజన్న, నాయకులు జాహిద్ ఆలీ, శంకర్, మధు, కిష్టయ్య,రాంచందర్, మధుకర్‌గౌడ్, రమేష్, భగవంతు, వినోద్‌రెడ్డి, తిరుపతి, రాజారాం, రమేష్, జనార్ధన్, లచ్చన్న, శంకర్, మహేష్, బాపు, నగేష్, సుధాకర్‌రెడ్డి, గట్టయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

తాండూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పనులజాతర కార్యక్రమంలో భాగంగా మండలంలో శుక్రవారం అధికారులు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మాదారం 3 ఇంక్లైన్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, అలాగే కొత్తపల్లి గ్రామంలో కాటిల్ షెడ్ నిర్మాణానికి ఎంపీడీవో శ్రీనివాస్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో అనిల్‌కుమార్, పీఆర్ ఏఈ సాయిలత, ఏపీవో నందకుమార్ పాల్గొన్నారు. అలాగే అచ్చలాపూర్ గ్రామంలో పశువుల పాక నిర్మాణ పనులను ప్రారంభించారు. నర్సాపూర్ గ్రామంలో ఉపాధిహామీలో వంద రోజులు పనులను పూర్తి చేసిన కూలీలను ఘనంగా సన్మానించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వారికి రక్తం అందించే రక్తదాతలే నిజమైన హీరోలని రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సిని నటుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేం ద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల ఐఆర్‌సీఎస్ బ్లడ్ సెంటర్‌లో అభిమానులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, 71 మంది రక్తదానం చేశారు. అనంతరం వారికి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, రెడ్‌క్రాస్ సంస్థ జనరల్ సెక్రటరీ నూతి వేణు గోపాల్‌రెడ్డి, శంకర్ వర్మ, నవీన్ కుమార్, మాధవి, రాజ్‌కుమార్, లావణ్య, రజిత పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

దండేపల్లి ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసిన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొండు జనార్ధన్, మండల అధ్యక్షుడు రావనవేని రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నా సంబంధించిన వాల్ పోస్టర్‌లను సంఘం నాయకులతో కలిసి శుక్రవారం దండేపల్లిలో విడుదల చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్యాల మల్లేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అప్పాల మనోహర్, మహిళ కార్యదర్శి వర లక్ష్మీ, పాత రమేష్, సంఘం నాయకులు నరేందర్, గంగన్న పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎం

దండేపల్లి ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గెజిటెడ్ గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా సంగర్స్ రాజేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పని చేసిన నరేందుల శ్రీనివాస్ నుంచి శుక్రవారం పూర్తి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాజేశ్వర రావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల ఉన్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. అనంతరం హెచ్‌ఎంను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, సీఆర్‌పీ పాల్గొన్నారు.

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దు

నెన్నెల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రసాయణ ఎరువులు మోతాదుకు మించి వాడొద్దని భీమిని ఏడీఏ సురేఖ అన్నారు. మండల కేంద్రంలోని పంట పొలాలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యూరియా ఎకరానికి ఒక బస్తా కంటే ఎక్కువ వేయవద్దన్నారు. నత్రజనితో పంట ఎక్కువ పచ్చబడి చీడపీడల ఉధృతి పెరుగుతుందని చెప్పారు. వరి నాటు వేసే పొలాల్లో దమ్ములో ఒక బస్తా డీఏపీ, అర బస్తా యూరియా, పొటాష్ కలుపుకొని చల్లుకోవాలన్నారు.

ఆర్‌కేపీలో దుర్గాదేవి విగ్రహం ప్రత్యక్షం

రామకృష్ణాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌కే1ఏ మా ర్కెట్ దుర్గదేవి శరన్నవరాత్రులు జరుపుకునే ప్రాంతంలో శుక్రవారం దుర్గాదేవి విగ్రహం బయపడింది. ఈ విషయం తెలిసిన రామకృష్ణాపూర్‌తో పాటు మందమర్రి, శ్రీరాంపూర్, మంచిర్యాలకు చెందిన ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి విగ్రహానికి పాలాభిషేకం చేస్తూ నిర్వహించారు. గత సంవత్సరం నుంచి ఈ ప్రాంతంలో మట్టిలో ఉందని వెలికి తీసి గుడి నిర్మించాలని అమ్మవారి భక్తులకు కళలో కనిపిస్తూ చెప్పినట్లు అర్చకులు సాయినాథ్ చెప్పిన మాట రుజువుకావడంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కంభగోని సుదర్శన్‌గౌడ్ ఈ ప్రాంతంలో గుడిని ర్మించనున్నట్లు పేర్కొన్నారు.

పిచికారీలో.. జాగ్రత్త

(5వ పేజీ తరువాయి)

పురుగు మందులను నాలుగు రకాలుగా విభజించారు. మందు డబ్బాపై ముద్రించిన చిహ్నాన్ని చూసి తగిన జాగ్రత్తలు పాటించాలి. చిహ్నం ఎరుపు రంగులో ఉంటే చాలా ఎక్కువ, పసుపు రంగు ఎక్కువ, నీలం రంగు మధ్యస్థం, ఆకుపచ్చ రంగులో ఉంటే తక్కువ విష తీవ్రత ఉన్నట్టు గుర్తించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

●పురుగు మందు డబ్బా మూతను నోటితో తీయ రాదు. మందు ద్రావణాన్ని చేతులతో కలుపకూడదు. కర్రను ఉపయోగించి కలుపుకోవాలి.
●పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా వెడెల్పు పడేలా చేయరాదు. పిచికారి సన్నగా తుంపర్లుగా పడేలా చూసుకోవాలి.
●రెండు లేదా మూడు మందులు కలిపి పిచికారి చేయకూడదు.
●చేతులకు తొడుగులు, కంటికి అద్దాలు, ముక్కు, నోటికి మాస్క్ తప్పనిసరిగా ధరలించాలి.
●పైరు పెద్దదిగా ఉన్నప్పుడు హెల్మెట్ పెట్టుకోవ డం ఉత్తమం.
●స్ప్రే చేసేటప్పుడు తినడం, తాగడం, పొగతాడం, కళ్లు నలుపుకోవడం, నోటిలో వేళ్లు పెట్టుకోవడం చేయకూడదు.

గాలికి ఎదురుగా స్ప్రే చేయరాదు

గాయాలైన చేతులతో మందులను తాకరాదు. పిచికారి పూర్తి అయిన వెంటనే సబ్బుతో స్నానం చేయాలి. ఖాళీ డబ్బాలను నివాస ప్రాంతాలకు దూరంగా పాతిపెట్టాలి.

ప్రథమచికిత్స:

●పిచికారి సమయంలో మందు ప్రభావానికి గురైనప్పుడు తక్షణమే ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించాలి.
●కంట్లో మందు పడితే చల్లని నీటితో కడగాలి.
●ప్రభావానికి గురైన వ్యక్తి నోట్లో వేళ్లు పెట్టి వాంతి చేయించాలి.
●శరీర ఉష్ణోగ్రత పెరిగితే చల్లని నీటితో తుడువాలి. ఉష్ణోగ్రత తగ్గితే దుప్పటి కప్పి వెచ్చదనం ఉండేలా చూడాలి.

చిన్నతిమ్మాపూర్ గ్రామ సమస్యలు పరిష్కరించండి

భీమిని, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నతిమ్మాపూర్ గ్రామ పంచాయతీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ కు చిన్నతిమ్మాపూర్ రైతులు వినతి పత్రం అందించారు. చిన్నతిమ్మాపూర్ గ్రామ సరిహద్దులో నష్ట పోయిన పంటలను ఆయన పరిశీలించారు. గ్రామస్థులు, రైతులు అక్కడికి చేరుకోని వినతి పత్రం అందించారు. చిన్నతిమ్మాపూర్, తంగళ్లపల్లి గ్రామాల మధ్యలో ఎర్రవాగుపై శాశ్వత వంతెన నిర్మాణం, గ్రా మంలో నూతన రేషన్ షాప్ ఏర్పాటు, పాల్వాయి పురుషోత్తం రావు ప్రా జెక్ట్ బ్యాక్ వాటర్ వలన ప్రతీ ఏడూ వర్షాలకు పంటలు నష్ట పోతు న్నా మని అందువల్ల ముంపు గ్రామంగా ప్రకటించి గ్రామంలో రైతులకు నష్ట పరిహారం అందించాలని ఎమ్మెల్సీని కలిసి విన్నవించి వినతి పత్రం అందించారు. దీనికి ఆయన స్పందించి ప్రభుత్వం నుంచి నష్ట పోయిన ప్రతీ రైతు కుటుంబానికి ఎకరానికి రూ. 10 వేలు పరిహారం అందేలా హామీ ఇచ్చారు. మాజీ సర్పంచు ఇందూరు భూమయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఆహ్వానం

మంచిర్యాల క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో త్వరలో నూతన భవన శంకుస్థాపన మహోత్సవానికి హాజరుకావాలని హైకోర్టు న్యాయమూర్తులను మంచిర్యాల బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు శుక్రవారం కలిసి ఆహ్వానించారు. హైకోర్టు న్యాయమూర్తి అభ్రేష్ కుమార్ సింగ్, అడ్మినిస్ట్రేటివ్ హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమ్సపాక, బిల్డింగ్ కమిటీ సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మన్, న్యాయమూర్తి విజయ సేన్‌రెడ్డి, రవీంద్ర శర్మలను మర్యాదపూర్వకంగా కలిశారు.

కార్యక్రమానికి హాజర వుతారని వారు తెలిపినట్లు బార్ అసోసి యేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు తెలిపారు.

కార్మిక సంఘాలకు గేటు మీటింగ్ తేదీల ఖరారు

కాసిపేట, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో ఈ నెల 29న జరుగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా ఐదు యూనియన్‌లకు గేటుమీటింగ్ తేదీలను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ శుక్రవారం ప్రకటించారు. ఓరియంట్‌లో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐదు యూనియన్లు పోటీ పడుతున్నాయి. ఈ యూనియన్లకు ఈ నెల 23న ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్‌కు అవకాశం కల్పించగా 24న తెలంగాణ ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్‌కు అవకాశం ఇచ్చారు. 25న ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ లోకల్ యూనియన్‌కు తేదీని ఖరారు చేశారు. 26న లోకల్ ఓరి యంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్ యూనియన్‌కు కేటాయించారు. అలాగే ఈ నెల 25న ఓరియంట్ సిమెంట్ కార్మిక సంఘానికి తేదీలను ఖరారు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

'కాళేశ్వరం'తోనే రైతాంగానికి తీవ్ర నష్టం

మంత్రి వివేక్‌వెంకటస్వామి

కోటపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే ఈ ప్రాంత రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని దేవులవాడ గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మునిగిన పంట పొలా లను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన తర్వాత బ్యాక్ వాటర్ వల్ల మండలంలోని బబ్బెరచెలక, రాంపూర్, దేవులవాడ, వెంచపల్లి ప్రాంతాల్లోని పంటలు నీట మునిగి పంట నష్టం జరుగుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమీషన్‌ల కోసమే కట్టారని గతంలోనే చెప్పానన్నారు. పోయిన అసెంబ్లీ సమావేశాల్లో ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లానని, ప్రాజెక్టుకు కరకట్టలు కట్టాలని సంబంధిత మంత్రిని అడిగానన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టం జరిగిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదు కుంటుందని, జరిగిన నష్టంపై సర్వే చేయాలని అధికా రులను ఆదేశించానన్నారు. అనంతరం కొల్లూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేష్ తివారీ, తహసీల్దార్ రాఘవేంద్ర రావు, ఆయా శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దేవులవాడలో సీసీ రోడ్డు సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

కార్మికుని కుటుంబానికి పరామర్శ

జైపూర్ : మణుగూరులోజరిగిన దుర్ఘటనలో చెరువులో పడి మృతిచెందిన సింగరేణి కార్మికుడు సుంకరి శ్రీనివాస్ కుటుంబాన్ని మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి కలెక్టర్ కుమార్‌తో కలిసి పరామర్శించారు. సింగరేణి అధికారులతో చర్చించి కుటుంబానికి న్యాయం చేస్తానని, మృతుడి భార్యకు స్థానికంగా ఉద్యోగం వచ్చే లా చూస్తానని తెలిపారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి

జైపూర్ : పనుల జాతరలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం మంత్రి వివేక్‌వెంకటస్వామి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ. 3 లక్షల నిధులతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అధిక రోజులు పనిచేసిన రాజకుమారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనా రాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్ పాల్గొన్నారు.

మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

భీమారం : భీమారం మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. పనుల జాతరలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని లాల్ బహదూర్ కాలనీలో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల ప్రజల వైద్యం కోసం మండలంలో ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు కొనసాగుతున్నాయని, 108 అంబులెన్స్ ఏర్పాటు చేశామన్నారు. మంత్రికి పలు కాలనీల ప్రజలు సమస్యలు విన్నవించారు. కొంత మంది మహిళలు ఇందిరమ్మ ఇళ్లు రాలేదని మంత్రికి విన్నవించారు. అర్హులైన వారందరికి ఇళ్లు మంజూరయ్యేలా చూస్తానని మంత్రి తెలిపారు. మంత్రి పర్యటన సందర్భంగా భీమారం ఎస్ఐ శ్వేత బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో మధుసూదన్, కాంగ్రెస్ నాయకుడు రవి, రమేష్, రాంరెడ్డి, రాజ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు..

● అధికారుల తీరును ఎండగడుతూ రైతుల స్వీయ నిర్బంధం



చెన్నూరులో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

చెన్నూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణ కేంద్రంలో యూరియా కోసం శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు బారులు తీరారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వ ర్యంలో యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో ఉదయాన్నే రైతులు, మహిళ రైతులు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యా లయానికి చేరుకున్నారు. మార్కెట్ కమిటీ గోదాంలో సంబంధిత అధికారులు కౌంటర్ ఏర్పాటు చేసి టోకెన్‌లు ఇచ్చారు. గోదాంకు వందలాది మంది చే రుకుని క్యూలైన్‌లో నిలబడ్డారు. యూరియా కోసం దాదాపు 1500 మంది రైతులు కౌంటర్ వద్దకు చేరుకోవడంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏ ర్పడింది. ముందుగా గోదాంలో క్యూలైన్‌లో ఉన్న రైతులను బయటకు వెళ్లి లైన్‌లో నిలబడాలని అధికారులు కోరడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఉ దయం నుంచి క్యూలైన్‌లోనే ఉన్నామని, ఇప్పుడు బయట ఉండాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని అధికారుల తీరును ఎండగట్టారు. గో దాంకు ఉన్న స్వెట్టర్లను మూసివేసి స్వీయ నిర్బంధం చేసుకుని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రైతులందర్నీ లైన్‌లో ఉంచి టోకెన్‌లు ఇప్పించారు. ఒక్కో రైతుకు ఒక్కో ఎరువు బస్తా ఇచ్చారు. దీనిపై రైతులు అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి 444 యూరియా బస్తాలు మంజూరు కాగా క్యూలైన్‌లో ఉన్న 444 మందికి టోకెన్‌లు ఇచ్చి యూరియా బస్తాలను పంపిణీ చేశారు. మిగితా 1500 మంది రైతులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఉదయం నుంచి క్యూలైన్‌లో ఉంటే ఒక్క బస్తా ఇస్తే వ్యవసాయం ఎలా చేసుకునేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా చెన్నూరు ఎమ్మెల్యే, మంత్రి వివేక్‌వెంకటస్వామి స్పందించి రైతులకు సరిపడ యూరియా బస్తాలను అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలించాలి

● జిల్లా విద్యాధికారి యాదయ్య

మంచిర్యాలక్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమరవాణాను నిర్మూలించడం మన అందరి బాధ్యత అని డీఈవో యాదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, ప్రజ్వలన సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ చంద్రయ్య రెండురోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా వారు మాట్లాడుతూ మనుషుల అక్రమరవాణ నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నిర్మూలించవచ్చ న్నారు. ప్రజ్వలన స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణసంస్థ ఆధ్వర్యంలో పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఏఎంవో సత్యనారాయణ మూర్తి, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు పాల్గొన్నారు.

గ్రామ సమాఖ్య స్థలాన్ని కాపాడండి

జైపూర్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామసమాఖ్య భూమిని రక్షించి పక్కా భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని మంత్రికి వేక్ వెంకటస్వామికి మండల సమాఖ్య అధ్య క్షురాలు మాలతి వినతిపత్రం అందించారు. వీవో అధ్యక్షురాలు మద్దుల సునీత, ఏపీఎం సంతోష్ కుమార్, ఈసీ దీపక్ ఉన్నారు.

ఖాతాదారులు రీ కేవైసీ చేసుకోవాలి

నస్పూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం ఖాతాలను రీ కేవైసీ చేసుకోవాలని సీతారాంపల్లి శాఖ మేనేజర్ జి. నర్సింహస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు ఆధార్, పాన్ కార్డులతో పాటు ఫోన్ నంబరును తమ బ్యాంకులో ఇస్తే వాటిని ఖాతాకు అనుసంధానం చేస్తామన్నారు.

పిచికారీలో.. జాగ్రత్త

● నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు

● రసాయనాల స్ప్రేలో అవగాహన అవసరం

● మోతాదుకు మించి వినియోగం వద్దు

● ఒకేసారి మూడు, నాలుగు మందులవాడకం ప్రమాదకరం

పవర్ స్ప్రేయర్‌తో పిచికారి చేస్తున్న రైతు



నెన్నెల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులు ఎదుర్కొనే సమస్యలు అన్నీఇన్నీ కావు. పంట దిగుబడి ఇంటికి చేర్చే వరకు కంటికి రెప్పలా కాపాడు కోవాలి. విత్తనం వేసింది మొదలు కోతకోసే వరకు తెగుళ్లు, పురుగుల బెడద నుంచి రక్షించుకోవాలి. పంటలను కాపాడే ప్రయత్నంలో రైతులు ప్రాణంమీదికి తెచ్చుకుంటున్నారు. చీడపీడల నివారణకు ఉపయోగించే క్రిమిసంహారక మందులు పిచికారిలో నిర్లక్ష్యంగా ఉండటంతో ఏటా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పత్తి పంటలో మందుల స్ప్రే పనులు జోరుగా సాగు తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

● అవగాహన లోపంతో

రైతులు అవగాహన లోపంతోనే క్రిమిసంహారక మందులు అధికంగా వినియోగిస్తున్నారు. ఒక్కోచేనులో అయిదారు సార్లు వివిధరకాల మందులు కలిపి స్ప్రే చేస్తున్నారు. పత్తిచేలల్లో రెండుసార్లు కలుపు నివారిణి, మరో నాలుగుసార్లు క్రిమిసంహారక మందులు పిచికారి చేయాల్సి వస్తోంది. ఒక్కో రైతు పదేసిఎకరాల్లో పత్తిసాగు చేయడంతో తక్కువకాలంలో ఎక్కువ స్ప్రే చేసేందుకు థైవాన్, చైనా పవర్ స్ప్రేయర్లు వాడుతున్నారు. ఈ స్ప్రేయర్లతో ఎక్కువ ఒత్తిడితో తుంపర్లుగా మందు పిచికారి అవుతుంది. కొట్టే వారి ఒంటిపై మందు పడటంతో పాటు కళ్లు, ముక్కు, నోట్లోకి పోతోంది. మందు ప్రభావంతో వెంటనే కంటి సమస్యలు వస్తున్నాయి. అప్పటికి అప్పుడు ఏమి కాకపోయినా మెల్లిమెల్లిగా మందు ప్రభావంతో రోగాలపాలవుతున్నారు. దీంతో మందుల పిచికారీ సమయాల్లో జాగ్రత్తలు పాటించక ఆసుపత్రుల పాలయ్యే వారు అధికం అయ్యారు.

● ఇదీ 'విష'యం..

రసాయణాల్లో కీటక నాశినులు, శిలీంద్రనాశినులు, కలుపు నివారణ మందులు, పూత, కాతకు తోడ్పాటు నిచ్చే ఉత్ప్రేరకాలు ఉంటాయి. వీటిని పిచికారి చేసే సమయంలో రైతులు తగుజాగ్రత్తలు తీసుకోవాలి. మం దుల్లో ఉండే క్రీయాశీలక రసాయణాన్ని బట్టి విష తీవ్రత వివిధస్థాయిల్లో ఉంటుంది. ఈ విష తీవ్రత ఆధారం చేసుకొని..

(తరువాయి 7లో)

ముందు జాగ్రత్తలు పాటించాలి..

మందులు పిచికారి చేసే సమయంలో రైతులు ముందు జాగ్రత్తలు పాటించాలి. పంట రోగాల బారిన పడితే అధికారులను సంప్రదించి వారు సూచించిన మందులనే తగిన మోతాదులోవాడాలి. అధికంగా వాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. స్ప్రే చేసేటప్పుడు శరీ రం మొత్తం కప్పబడే దుస్తులు, మోఖానికి మాస్కు, చేతులకు తొడుగులు, కళ్లజోడు దరించాలి. స్ప్రే చేసిన చేతులతోనే పొగతాగడం, గుట్కాలు వేసుకోవడం మం చిది కాదు. గాలికి ఎదురుగా కాకుండా గాలివాటానికి అనుకూలంగా పిచికారి చేస్తే పంటకు బాగా పడు తుంది. మనిషికి ఇబ్బంది ఉండదు. ఎండకు కాకుండా ఉదయం, సాయంత్రం పూటల్లో పిచికారి చేసుకోవడం శ్రేయస్కరం.

-పుప్పాల సృజన, మండల వ్యసాయ అధికారి, నెన్నెల

రక్తదానానికి యువత ముందుకు రావాలి

● బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్



రక్తదాన గ్రహీతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న సబ్ కలెక్టర్

బెల్లంపల్లి, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడానికి యువత ముం దుండాలని సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. శుక్రవారం బ్రహ్మకుమారీస్ ఈశ్వ రీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వ హించిన రక్తదాన శిబిరాన్ని సబ్‌కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంపై అపోహలు వీడి రక్తదానం చేయాలని ఎంతో మందికి పునర్జన్మ ఇచ్చి నవారవుతారన్నారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానంపై అపోహలు వీడి రక్తదానం చేయాలని, అన్నిదానాల కంటే రక్తదానం గొప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు పద్మ, కైవల్య, వైద్యులు మధుకర్‌నాయక్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా బాధ్యులు కాసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ముందస్తు అరెస్టు

నస్పూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్ల సమస్యల సాధనకు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ధర్నా నేపథ్యంలో నస్పూర్‌లో ముందస్తుగా పలువురు రేషన్ డీలర్లను ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు నల్లం రవి కుమార్ మాట్లాడుతూ రేషన్ డీలర్లకు ఐదు నెలల కమీషన్ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్లను వెంటనే ప్రకటించాలన్నారు. ఈ ప్రధాన డిమాండ్లతో ధర్నా చేపట్టామని, హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు తనతో పాటు పండగ శ్రీధర్, బాబు, చెరుకు అశోక్‌లను అదుపులోకి తీసుకుని తర్వాత వదిలి పెట్టారన్నారు.

ఎంపీడీవోకు వినతి

తాండూర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండంలోని ఆదివాసీ గూడాల్లో వాగులపై బ్రిడ్జిలు, రోడ్లు నిర్మించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం నాయకులు ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. ఆదివాసీ గూడాలకు నేటికి రవాణా సౌకర్యం,వాగులపై వంతెనలు, రోడ్లు సరిగ్గాలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అనంతరం వాగులపై బ్రిడ్జి నిర్మించాలని తహసీల్దార్ కార్యాలయం ముందు దీక్షలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంకె రవి, దాగం రాజారాం, రాజేశం, నానయ్య పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని విద్యార్థుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

జన్నారం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యారంగంలో మార్పు పేరిట ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్‌ను, స్కాలర్‌షిప్‌లలో కోత విధించే ఆలోచన చేస్తున్నారని తెలంగాణస్టేట్‌యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గొల్లపల్లి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ఏర్పడ్డ తరువాత రేవంత్‌రెడ్డి విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని చెబుతూ మరోపక్క రీయింబర్స్‌మెంట్‌లో కోతలు విధించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ పథకంలో మార్పులపేరిట ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. ఇలాంటి ఆలోచనలు మానుకొని పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కథ ముగిసింది

● మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ మానస పుత్రిక పేరుతో నిర్మాణం చేపట్టిన కాళేశ్వరం పాజ్రెక్టు కథ ముగిసిందని ఆ ప్రాజెక్టు నీటి అవసరాలు లేకుండానే 70శాతానికిపైగా పంట పండిస్తున్నారని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షల కోట్ల కుంభకోణం జరిగింది వాస్తవం కాదా అని ఇటీవల ఆప్రాజెక్టుకు సంబంధించి కోర్టు నివేదిక ప్రభుత్వానికి అందించారని తెలిపారు. శుక్రవారం మందమర్రిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిఉన్న ప్రాజెక్టును సొంత నిర్ణయాలతో ప్రజాధనాన్ని దుర్విని యోగం చేసి ఈ ప్రాజెక్టును కాళేశ్వరం వద్ద కట్టారని పేర్కొన్నారు. ఆ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన మూడేళ్లలోనే పెద్ద పగుళ్లు తేలి పనికి రాకుండా పోయే స్థాయికి చేరిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం తరువాత బ్యాక్ వాటర్‌తో పాటు చెన్నూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో 500 ఎకరాలకు పైగా పంట నష్టపోయారని వారిని ఆదుకుంటామని తెలిపారు. కేంద్రంలో యూరియా సరఫరా చేస్తే సక్రమంగా అందరికి అందించే చర్యలు చేపడు తామన్నారు. దేశ వ్యాప్తంగా ఓట్ల దొంగతనానికి సంబంధించి తమ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన నిర్ణయాన్ని అందరూ అభినందిస్తున్నారని తెలి పారు. దీనిపై అన్ని పార్టీలు కూడ స్పందించాలన్నారు. రాష్ట్రంలో రై తాంగానికి యూరియా అందజేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ కృషి చేస్తున్నారని తెలిపారు. పని చేసే ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ప్రజలు నమ్మరనే విషయాలు ప్రతిపక్షాలు గుర్తిస్తే బా గుంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

● మంత్రి వివేక్ వెంకటస్వామిని మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు శుక్రవారం కలిశారు. ఓదెలు ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు.

● పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన అస్రా మసీదు పెద్ద గులాం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శుక్రవారం మంత్రి వివేక్‌వెంకటస్వామి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. గులాం సోదరుడు సజ్జు కాంగ్రెస్ నాయకుడు కాగా మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలి

● తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి మహేష్

నస్పూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రానున్నది బీసీల రాజ్యపాలన అని, బీసీల్లో ఇంకా రాజకీయ చైతన్యం రావాల్సినవసరం ఉన్నదని తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి మహేష్ వర్మ అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్రకులాల అణచివేతలను ఎదురొడ్డి మరింత రాజకీయ చైతన్యంతో ముందుకు వెళ్లాలన్నారు. కలిసివచ్చే ప్రతి బీసీ నాయకులతో కలిసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ఇటీవల తన అధ్యక్షతన నిర్వహించిన తీర్మార్ మల్లన్నసభ విజయవంతం అయ్యిందన్నారు. విజయవంతంకు కృషిచేసి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సమావేశంలో నాయకుల దీపక్, పడాల శివతేజ, ఎండీ లతీఫ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్ వర్మ

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మందమర్రిటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పోలీసు నియమనిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ తెలిపారు. బుధవారం మందమర్రిలో ఆయన మాట్లాడుతూ మండపాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. శాంతి యుతంగా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. పోలీసుశాఖ నిబంధనలను పాటిస్తూ అందరు సహకరించాలన్నారు. మండపాల వద్ద భక్తులకు పలు సౌకర్యాలు కల్పించాలని, మహిళల పట్ల గౌరవంగా మెలగాలన్నారు. మండపాలను ప్రతి రోజు పోలీసులు పరిశీలిస్తారన్నారు. ఈ సమావేశంలో సీఐ శశిధర్ రెడ్డి, ఎస్‌ఐ పాల్గొన్నారు.

వాగుపై బ్రిడ్జి నిర్మించాలి..



వాగు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తాండూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్‌లోని వాగుపై బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి దాగంరాజారం డిమాండ్‌చేశారు. శుక్రవారం బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ వాగు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ పరిధిలోని సోయం లచ్చుపటేల్ గూడెంకు దారిలో ఉన్న తాత్కాలికంగా వాగుపై ఏర్పాటు చేసిన వంతెన కూలిపోయిందన్నారు. ప్రతి వర్షాకాలంలో వాగు దాటలేక ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంకె రవి, రాజేశం, రాజయ్య, బాఉరావు, బాదిరావు, గంగారాం, పార్వతి రావు, వెంకటేష్,చిన్ను, మారుతి, జంగు, ఈశ్వరి, విజయలక్ష్మీ, పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడినవారిపై గ్యాంగ్ ఫైల్ ఓపెన్ చేయాలి

● గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): పదే పదే నేరాలకు పాల్పడినవారిపై గ్యాంగ్ ఫైల్ ఓపెన్ చేయాలని రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో మంచిర్యాల జోన్, పెద్దపల్లి పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జోన్ల వారిగా స్టేషన్ డివిజన్లవారిగా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి నేరస్తుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జీషీట్లకు సంబంధించి ప్రస్తుత కేసులస్థితి గతులపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులదర్యాప్తులో అందుబాటులో ఉన్న టెక్నాలజీతో పాటు శాస్త్రీయ పద్ధతిని కూడా అనుకరిస్తూ దర్యాప్తును చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరిగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

సైబర్ క్రైం అనేది ఒక పెద్ద సమస్య అని సైబర్ క్రైంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడిన చట్టపరమైన కఠినచర్యలు తప్పవని గంజాయి నియంత్రణకోసం ప్రత్యేకటీంలు ఏర్పాటు చేయాల న్నారు. రామగుండం పోలీసు కమిషనర్ పరిధిలో 2025లో ఇప్పటి వరకు గంజాయి అక్రమ రవాణ, ప్రత్యేకనిఘా, ఇన్‌ఫర్‌మేషన్ వ్యవస్థ ఏర్పాటు చేసుకొని, పెద్దపల్లి జోన్ పరిధిలో 34 కేసులలో 98 మందిని అరెస్టుచేసి 157.102కిలోల గంజాయి సీజ్ చేసి నట్లు తెలిపారు. మంచిర్యాల జోన్ పరిధిలో 34 కేసులలో 98మందిని అరెస్టు, 34.541 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులలో నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన సిబ్బందికి సీపీ చేతుల మీదుగా క్యాష్ రివార్డు అందించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విగ్రహాల ప్రతిష్టాపన విషయంలో నిర్వాహకులతో ముందుగానే సమావేశం ఏర్పాటు చేయాలని ఎక్కడ శాంతిభద్రతలు తలెత్తకుండా చూడాలన్నారు.



సీఐ రాజుకుమార్‌కు రివార్డు అందజేస్తున్న రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తామని సీపీ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. మంచి ర్యాల జోన్ రామకృష్ణాపూర్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తు మృతి చెందిన వెంకట్‌రెడ్డి కుటుంబానికి కుటుంబ సభ్యులకు ఆయన భద్రత చెక్కును అందజేశారు. ఎస్‌ఐ భార్య శ్రీలతకు భద్రత ఎక్స్‌గ్రేషియా రూపాయల 8లక్షల చెక్కును అందజేశారు. ఏసీపీ మల్లారెడ్డి, ఏవో శ్రీనివాస్, రామగుండం పోలీసు కమిషనరేట్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు బోర్ల కుంట బోజలింగం పాల్గొన్నారు.

వనితకు బీమా.. కుటుంబానికి ధీమా

● స్వయం సహాయక సభ్యులకు చేకూరనున్న ప్రయోజనం

● ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షల పరిహారం

● ఆర్థికంగా చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

7

సైక్లింగ్‌తో ఉపయోగాలెన్నో

● ఆరోగ్య ప్రయోజనాలు మెండు ● పర్యావరణానికి తోడ్పాటు

6